సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 28 । జూలై । 2024



9.596 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో శనివారానికి 9.596 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 200, దక్షిణ కాలువకు 5, ఉత్తర కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.70,780
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,339
3 శాతం జీఎస్టీతో	రూ.6,529
సవర (8గ్రాములు)	రూ.52,232

గరిష్టం/కనిష్టం

30.6 /25.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం తర్వాత చిరు జల్లులు పడొచ్చు. వాతావరణంలో తేమ 55 శాతం ఉంది.

న్యూస్‌రీల్

గెస్ట్ ఫ్యాకల్టీకు దరఖాస్తులు ఆహ్వానం

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి డిగ్రీ కాలేజీలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్ సబ్జెక్ట్‌లకు ఫ్యాకల్టీలు అవసరం ఉందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీ లోపు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94908 97509 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

10న జెడ్పీ సర్వసభ్య సమావేశం

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా పరిషత్ సాధారణ సరసభ్య సమావేశం ఆగస్టు 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరై జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు, అభివృద్ధికి ప్రతిపాదనలు తెలిపాలని కోరారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు.

ఫోర్జరీ వ్యవహారంపై దర్యాప్తు ముమ్మరం

- తెర వెనుక పాత్రధారులపై ఆరా

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు గతంలో పని చేసిన కమిషనర్ల సంతకాలను ఫోర్జరీ చేసిన వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన నలుగురు ఉద్యోగులను ప్రాథమిక విచారణ అనంతరం గత కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. అయితే ఫోర్జరీ వ్యవహారంలో మేయర్ భర్త జయవర్ధన్ ప్రమేయం ఉన్నట్లుగా అతనిపై ఎస్పీకి కమిషనర్ ఫిర్యాదు చేసిన విషయం కూడా తెలిసిందే. దీంతో జయవర్ధన్‌తో పాటు ప్రైవేట్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)లు దిలీప్‌కుమార్, శివకృష్ణ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రస్తుతం వీరంతా పరారీలో ఉన్నారు. మరో వైపు సస్పెండ్ అయిన నలుగురు ఉద్యోగులకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లు, ఇతర వివరాలను పోలీస్ అధికారులు కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఇప్పటికే సేకరించారు. మరోసారి శనివారం కూడా నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో పాటు సస్పెండైన నలుగురు ఉద్యోగులు, ప్రైవేట్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) చిరునామాలు, ఫోన్ నంబర్లను, కీలక సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.

చెరువుల చెర..

నదీగర్భం ధ్వంసం

ఇసుక, మట్టిని కొల్లగొడుతున్నారు

- రాత్రి వేళ పొట్టేపాళెం ఇసుక రీచ్ నుంచి అక్రమ రవాణా
- ఆత్మకూరు, కావలి, కోవూరు నియోజకవర్గాల్లో చెరువులు గుల్ల
- రైతుల పేరుతో అనుమతులు తీసుకుని మట్టిని తోడేస్తున్న తమ్ముళ్లు
- రియల్ వెంచర్లుకు, ఇటుక బట్టీలకు విక్రయాలు
- టీడీపీ నేతల దందాలను కళ్లప్పగించి చూస్తున్న అధికార గణం
- అవినీతిలో భాగస్వాములవుతున్న అధికారులు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన రోజు రాత్రి నుంచే టీడీపీ నేతలు ఒక పక్క రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూనే మరో పక్క సహజ వనరుల దోపిడీకి తెగబడ్డారు. గత ప్రభుత్వం పెన్నానది నుంచి డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన లక్షల టన్నుల ఇసుకను ఖాళీ చేశారు. తాజాగా టీడీపీ ప్రభుత్వం ఇసుక పాలసీ తీసుకురావడంతో నేరుగా రీచ్‌ల్లోకి వెళ్లి ఇసుక దోపిడీకి తెరతీశారు. మరో వైపు ఆత్మకూరు, కోవూరు, కావలి నియోజకవర్గాల్లో చెరువులను పచ్చ నేతలు చెర పట్టి మట్టిలో కాసులు పిండు కుంటున్నారు. వందల టిప్పర్లు పెట్టి మట్టిని కొల్లగొట్టుతున్నాయి. టీడీపీ నేతల దాష్టీకాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు ధ్రుతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారు. తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా అవినీతిలో భాగస్వామ్యం అవుతున్నారు.

ఆత్మకూరు రాయల చెరువులో జేసీబీలు, టిప్పర్లతో మట్టి తవ్వకం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఆ పార్టీలోని అక్రమార్కులు బరితెగించారు. జిల్లాలో చెరువులను చెర బట్టితే.. నదీగర్భాన్ని ధ్వంసం చేస్తున్నారు. తమ అవినీతి అక్రమాలను ఎవరూ ప్రశ్నించకూడదనే లక్ష్యంతో ఓ వైపు రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగిస్తూనే.. మరో వైపు మట్టి, ఇసుక, గ్రావెల్‌ను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఇంత బరితెగించి వాగులు, వంకలు, ఇసుక రీచ్‌లు, చెరువుల్లో పడి దోచేస్తుంటే సంబంధిత అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతూ నిద్ర నటిస్తున్నారు. వీరిని అడిగితే ఏమి జరుగుతుందోననే భయంతో ప్రజలు, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు మౌనంగా ఉండిపోతున్నారు.

పొట్టేపాళెం రీచ్‌లో ఇసుక తోడేళ్లు

నెల్లూరు రూరల్ పరిధిలోని పొట్టేపాళెం ఇసుక రీచ్‌లో ఇసుక తోడేళ్లు తిష్టవేసి పెన్నమ్మను కుళ్లబొడుస్తున్నారు. ఇంకా ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించలేదు. ఇదే అదనుగా ఇసుకాసురులు పెన్నానదీ గర్భాన్ని ధ్వంసం చేస్తున్నారు. ఎన్నికలకు ముందే గత ప్రభుత్వ హయాంలో పొట్టేపాళెం డంపింగ్ యార్డులో సుమారు 5 లక్షల టన్నులు, మద్రిపాడులో 10 లక్షల టన్నులతో పాటు కావలి, పల్లిపాళెం, కందుకూరు, మినగల్లు తదితర ప్రాంతాల్లో సైతం లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేసింది. ఎన్నికల నేపథ్యంలో విక్రయాలు నిలిచిపోయాయి. ఈ నిల్వలు అలాగే ఉండగా, ఎన్నికల ఫలితాలు వెలువడిన రాత్రి నుంచే డంపింగ్ యార్డులో ఉన్న ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. ఆత్మకూరు, నెల్లూరు రూరల్ పరిధిలో ఉన్న ఇసుకాసురులపై ప్రభుత్వ పెద్దలు సీరియస్ కావడంతో విరామం ఇచ్చారు. ఈలోగా ప్రభుత్వం ఇసుక పాలసీ ప్రకటించి విక్రయాలు ప్రారంభించింది. అయితే పొట్టేపాళెం వద్ద డంపింగ్ యార్డు లేకపోవడంతో గత నాలుగు రోజులుగా టీడీపీ నేతలు రాత్రి వేళల్లో యంత్రాలు పెట్టి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేలు వంతున అధికార పార్టీ నేతలకు కప్పం కట్టి తీసుకెళ్తున్నారు. ఇసుక వాహనాలతో ఆ ప్రాంతం రణగొణ ధ్వనులతో దద్దరిల్లుతున్న పోలీస్, రెవెన్యూ, మైనింగ్,సెబ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. రీచ్‌లను నుంచి ట్రాక్టర్లతో తోలే ఇసుక రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేసి అక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అధికార పార్టీ నేతలు నిత్యం లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇసుక అక్రమ రవాణా విషయంలో ఇసుకాసురులకు గతంలో వార్నింగ్ ఇచ్చారు. మరీ ఇప్పుడు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. కావలి నియోజకవర్గంలోని పైడేరు వాగు, వరికుంటపాడు మండలంలోని పిల్లా పేరు, ఉప్పాగులో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.

తమ్ముళ్లకు కాసులు కురిపిస్తున్న చెరువులు

జిల్లాలోని సాగునీటి చెరువుల్లో కూడా పచ్చదొంగలు పడ్డారు. చెరువులను చెర పట్టి మట్టిని తోడేసి కాసులు పిండుకుంటున్నారు. ఆత్మకూరు, కావలి, కోవూరు నియోజకవర్గాల్లోని చెరువుల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కావలి నియోజకవర్గంలోని కావలి, ముసునూరు చెరువులతో పాటు కొత్తపల్లి చెరువులో యంత్రాలు పెట్టి మట్టిని తవ్వేస్తున్నారు. బోగోలు మండలంలోని బోగోలు, ముంగమూరు, కొండ బిట్రగుంట, కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం మిక్కిలంపేట, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు చెరువుల్లో భారీ యంత్రాలు పెట్టి మట్టిని పెకిలించి రియల్ వెంచర్లు, ఇటుక బట్టీలకు తొలుతున్నారు. ఒక్కో వాహనానికి రేటు ఫిక్స్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్లకు రూ.19 వేలు, ట్రాక్టర్లకు రూ.3 వేలు వంతున టీడీపీ నేతలు అమ్ముకుంటున్నారు. ఆయా చెరువుల నుంచి నిత్యం దాదాపు 250 నుంచి 300 టిప్పర్లు, వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. చెరువుల పేరులో పోరంబోకు భూములను తవ్వేసి గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

అవినీతిలో అధికారులూ భాగస్వాములేనా..?

అధికార పార్టీ నేతలు బరితెగించి సహజ వనరులు దోపిడీ చేస్తున్నా రెవెన్యూ, పోలీస్, సెబ్, మైనింగ్ అధికారులు మాత్రం తమకేమి తెలియదన్నట్లు నటిస్తున్నారు. ఎవరైనా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు అధికారుల కళ్లకు మామూళ్ల గంతలు కట్టేశారు. తెలిసినా తెలియదన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా మైనింగ్ శాఖ మాత్రం అక్రమార్కుల నుంచి అమ్యామ్యాలపైనే దృష్టి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు వెళ్లినా పక్కన పెట్టేస్తున్నారు. మైనింగ్ అధికారులు ఫోన్ ఎత్తేందుకు కూడా ఇష్టపడడం లేదు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

- ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న 1,923 మంది అభ్యర్థులు
- ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ఆన్‌లైన్లో పరీక్షల ప్రక్రియ
- హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
- సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- డీఆర్‌ఓ లవన్న

నెల్లూరు (దర్గామిట్ట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షలను ఆదివారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్ల డీఆర్‌ఓ లవన్న తెలిపారు. శనివారం నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో డిపార్ట్‌మెంటల్ పరీక్షల కోసం ఏపీపీఎస్సీ నిర్వహించనున్న ఆన్‌లైన్ పరీక్షపై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌తో డీఆర్‌ఓ లవన్న, ఏపీపీఎస్సీ అధికారులు కృష్ణవేణి, అంజనతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అబ్జెక్టివ్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కన్వెన్షనల్ పద్ధతిలో పరీక్ష జరుగుతుందని, పరీక్షకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జొన్నవాడ రోడ్‌లోని పొట్టేపాళెం అయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలోనే ఆరు రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 1,923 మంది అభ్యర్థులు డిపార్ట్‌మెంటల్ పరీక్షకు హాజరవుతున్నారని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలకు అనుమతించవద్దని, అభ్యర్థుల హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని, ఏపీపీఎస్సీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, లైజనింగ్ అధికారి గయాజ్ అహ్మద్, విద్యుత్‌శాఖ ఈఈ బాలచంద్ర, కలెక్టరేట్ ఏఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ లవన్న

పట్టభద్రులకు పరీక్ష

విక్రమ సింహపురి యూనివర్సిటీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. వర్సిటీలోని ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రధానంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం పనితీరు వివాదాస్పదంగా మారింది. తప్పుల తడకలుగా సర్టిఫికెట్లు, ప్రొవిజనల్స్, కాన్వొకేషన్ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల్లో అలవికాని నిర్లక్ష్యం నెలకొంది. వర్సిటీ విభాగాధిపతుల అలక్ష్యం వల్ల పట్టభద్రులు ఉన్నత చదువులకు భవిష్యత్ అవకాశాలను కోల్పోతున్నారు.

- అస్తవ్యస్తంగా వర్సిటీ ఎగ్జామినేషన్ విభాగం
- తప్పుల తడకగా సర్టిఫికెట్ల ముద్రణ
- ఆలస్యంగా డిగ్రీ, పీజీ ఫలితాల విడుదల
- ప్రొవిజనల్స్, కాన్వొకేషన్ పట్టాల జారీలో జాప్యం
- ఇతర రాష్ట్రాల్లోని వర్సిటీల్లో సీట్లు కోల్పోతున్న విద్యార్థులు
- సర్టిఫికెట్ల కోసం వెళితే ఛీదరింపులు, బెదిరింపులు
- వాల్యూయేషన్ కోసం ఎక్కువ పేపర్లు యోగి వేమన యూనివర్సిటీకే



ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైతే థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు జారీ చేసిన సర్టిఫికెట్



ఆర్ట్స్ బదులు సైన్స్ గ్రూపులో ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్ జారీ



పరీక్ష కేంద్రం పూర్తి అడ్రస్ లేని హాల్ టికెట్

నెల్లూరు (టౌన్): విద్యాలయాలకు గాడ్ ఫాదర్ వంటి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం గతి తప్పి వర్సిటీ వ్యవస్థకే కళంకం తెస్తోంది. తప్పుల మీద తప్పులు చేస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతోంది. ఫలితాల విడుదల్లో జాప్యం, సర్టిఫికెట్ల జారీలో ఆలస్యంతో మంచి యూనివర్సిటీల్లో సీట్లు కోల్పోతుంటే.. మరికొందరు ఉద్యోగావకాశాలను వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు వర్సిటీ అధికారుల తీరుపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. ఇంత జరిగినా.. ఆ విభాగం అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

ప్రతిష్టాత్మక వర్సిటీకి అప్రతిష్ట

గతంలో నెల్లూరు జిల్లాకు సంబంధించి డిగ్రీ, పీజీ, లా తదితర కోర్సులు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో ఉండేవి. దరఖాస్తు దగ్గర నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు అన్ని వ్యవహారాలు తిరుపతి వెళ్లి చేసుకోవాల్సి వచ్చేది. అయితే విద్యార్థుల సౌలభ్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో చారిత్రక నేపథ్యం ఉన్న విక్రమ సింహపురి పేరుతో ప్రతిష్టాత్మకంగా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. ఇందు కోసం కాకుటూరు వద్ద 60 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కొన్నేళ్లు నగరంలో తరగతులు, పరిపాలన జరిగాయి. ఆ తర్వాత 2017లో కొత్త భవనంలోకి వర్సిటీని మార్చారు. జిల్లాలో మొత్తం 67 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 30,244 మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీతో పాటు పీజీ, పీహెచ్‌డీని వర్సిటీ ద్వారానే నిర్వహిస్తున్నారు. లా కళాశాల వ్యవహారాలు కూడా వర్సిటీ పరిధిలోకి వస్తాయి. పీజీ, పీహెచ్‌డీ, లా కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 6 వేల మందికి పైగా చదువుతున్నారు. వీళ్లందరికీ పరీక్షల నిర్వహణ, ఫలితాలు విడుదల, సర్టిఫికెట్ల జారీ అన్ని వ్యవహారాలు యూనివర్సిటీ నుంచే నిర్వహిస్తారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన వర్సిటీని సంబంధిత విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు తమ వైఖరితో అప్రతిష్ట తెస్తున్నారు.

అస్తవ్యస్తంగా పరీక్షల విభాగం

యూనివర్సిటీకి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గుండెకాయ వంటిది. ఇక్కడ అన్ని వ్యవహారాలను సకాలంలో నిర్వహిస్తే వర్సిటీకి మంచి పేరొస్తుంది. అయితే ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న కొందరు అధికారులు, ఉద్యోగుల తీరు వర్సిటీకి చెడ్డ పేరు తెచ్చి పెడుతుంది. పరీక్షల విభాగంలో సర్టిఫికెట్లలో తరుచూ తప్పులు దొర్లుతున్నాయి. పరీక్షల నిర్వహణ ఆలస్యం, ఫలితాలు విడుదల్లో తీవ్ర జాప్యం, సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం, జవాబుదారీ తనం పూర్తిగా కరువైన పరిస్థితులు కనబడుతున్నాయి. సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మార్కుల మెమో కోసం దరఖాస్తు చేయాలని, ఇందుకు చలానా చెల్లించమని చెబుతున్నారు. ఈ మెమోలు కోసం నెల సమయం పెడుతున్నారు. తర్వాత నెలలో ప్రొవిజనల్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోమని చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు రెండు ప్రొవిజనల్స్ సర్టిఫికెట్లు కూడా జారీ చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితే డబ్బులు తీసుకుని కొంత మంది విద్యార్థులకు త్వరగా సర్టిఫికెట్లు ఇస్తున్నారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

సర్టిఫికెట్లలో తప్పులకు ఉదాహరణలు..

- సుద్దికట్టు దివ్య 2023వ సంవత్సరంలో డిగ్రీ ఆర్ట్స్ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించింది. అయితే వర్సిటీ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్‌లో సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఆర్ట్స్ గ్రూపులో ఉత్తీర్ణత సాధించినట్లు మార్చుకునేందుకు నాలుగైదుసార్లు వర్సిటీకి తిరగక తప్పలేదు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే తప్పు సవరించేందుకు రూ.300 ఫైన్ చెల్లిస్తే సవరిస్తామని చెప్పారు. దీంతో చేసేదేమిలేక డబ్బులు చెల్లించింది.
- ముది చిన అల్లూరయ్య నగరంలోని ఓ ప్రైవేట్ పీజీ కళాశాలలో మాస్టర్ ఆఫ్ సైన్స్ చదివారు. ఈ విద్యార్థి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తర్ణత సాధించారు. అయితే వర్సిటీ అధికారులు థర్డ్ క్లాసులో ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ విద్యార్థి కూడా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతను మార్చుకునేందుకు వర్సిటీ చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నట్లు చెబుతున్నారు.
- మన్నేపల్లి నాగమల్లిక పీజీ చేస్తున్నారు. ఈ ఏడాది జూలైలో పరీక్ష రాసేందుకు హాల్ టికెట్ జారీ చేశారు. అయితే ఆ హాల్ టికెట్‌లో కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అని మాత్రమే ఉంది. ఎక్కడా పూర్తి అడ్రసు లేదు. కళాశాల అడ్రస్ తెలుసుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వచ్చింది.
- డిగ్రీ చదివిన ఓ విద్యార్థికి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ సీటు వచ్చింది. ఆ విద్యార్థికి ఇప్పటి వరకు ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. పీజీలో చేరేందుకు ఈ నెల 26వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కాన్వొకేషన్‌కు కూడా 4 నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు.
- 2017లో కెమిస్ట్రీ విభాగంలో పీజీ పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి ఫెయిల్ అయినట్లు సర్టిఫికెట్‌లో ముద్రించారు. ఈ తప్పును సరిదిద్దుకునేందుకు రెండేళ్ల పాటు యూనివర్సిటీ చుట్టూ ప్రదక్షిణలు చేసినట్లు చెబుతున్నారు.
- లా పరీక్ష ఫలితాలు నేటికీ విడుదల చేయకపోవడంతో బార్ అసోసియేషన్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు గడువు ముగిసిపోతుందని పలువురు పట్టభద్రులు ఆందోళన చెందుతున్న పరిస్థితి.
- వర్సిటీతో పాటు ప్రైవేట్ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసిన ఎక్కువ పేపర్లను వ్యాల్యూయేషన్ కోసం తరుచు యోగివేమన యూనివర్సిటీకి పంపుతున్నారని వర్సిటీలోనే కొంతమంది అధికారులు చెబుతున్నారు. సాధారణంగా అన్ని యూనివర్సిటీలకు పంపాల్సి ఉంది. అయితే ఒకే యూనివర్సిటీకి ఎక్కువ పేపర్లను పంపడంలో మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



వర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా కొత్తగా వచ్చాను. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌లో జరుగుతున్న తప్పులను ఒకసారి పరిశీలిస్తాను. అందరిని విచారించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు త్వరితగతిన సర్టిఫికెట్లు అందేలా చర్యలు చేపడుతాం.

– ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు, ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, వీఎస్‌యూ

ఉదయగిరిలో డెంగీ కలకలం

ఉదయగిరి: ఉదయగిరిలోని పూసలకాలనీలో శనివారం డెంగీ కలకలం సృష్టించింది. కాలనీకి చెందిన చప్పలి రామారావు అనే యువకుడుకు డెంగీ జ్వరం బారిన పడడంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పది రోజుల క్రితం ఆ యువకుడికి జ్వరం రావడంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం డెంగీగా నిర్ధారించారు. ప్రైవేట్ వైద్యశాలలో ఖర్చులు భరించలేక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపికకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ శనివారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఉదయం 7 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలు అండర్-11, 13, 15, 17, 19 బాలబాలికలకు, మెన్, ఉమెన్ కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, వివరాలకు కోచ్ వెంకటేష్ 94944 92717 సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాణి

వెంకటాచలం: జైలు జీవితాన్ని అనుభవించి.. బయటకెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వాణి సూచించారు. చెముడుగుంట సమీపంలోని జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీల యోగక్షేమాలు, జైల్లో వసతులపై ఆమె ఆరాతీశారు. అనంతరం మాట్లాడారు. క్షణికావేశాలకు లోనై పాల్పడిన తప్పులను మళ్లీ చేయకుండా, కుటుంబసభ్యులు, ప్రజలతో మంచిగా మెలగాలని సూచించారు. న్యాయవాది లేని వారికి ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, అడిషనల్, డిప్యూటీ సూపరింటెండెంట్లు మహేష్‌బాబు, ఫణికుమార్, న్యాయవాది హర్ష తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

అనుమసముద్రంపేట: మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏఎస్‌పేట మండల కేంద్రంలోని చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఏఎస్సై విక్రమ్ వివరాల మేరకు.. కర్ణాటకలోని బెళగావి జిల్లా నాసక్ గ్రామానికి చెందిన అనీషా తన కుటుంబసభ్యులతో కలిసి ఏఎస్‌పేటలోని దర్గాకు ఈ నెల 24న వచ్చారు. తన కుమారుడు హైదర్ అలీ (35)కి మతిస్థిమితం లేకపోవడంతో దర్గాలోనే ఉన్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఆయన కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఈ తరుణంలో ఏఎస్‌పేటలోని చెరువు వద్ద మృతదేహాన్ని గమనించిన పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అనంతరం దర్గాలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

శ్రీశైలం నుంచి సోమశిలకు జలాలివ్వాలి



జేసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): రైతుల కోసం శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి సోమశిల జలాశయానికి నీటిని అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ కౌలు రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు జేసీ సేదు మాధవన్‌కు వినతిపత్రాన్ని శనివారం సమర్పించిన అనంతరం వారు మాట్లాడారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు తక్షణమే పది టీఎంసీలను విడుదల చేసేలా చొరవ చూపాలని విన్నవించారు. నేతలు చంద్రా రాజగోపాల్, శ్రీరాములు, గోపాల్, గురునాథం, పుల్లయ్య, వెంకమరాజు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేయనున్నాయని జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.189 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 125, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 170

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25

అప్రమత్తతతో హెపటైటిస్‌కు చెక్

- నిర్లక్ష్యం వహిస్తే పెను ముప్పు
- కాలేయ వ్యాధులతో పాటు కేన్సర్ వచ్చే ప్రమాదం
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న రోగులు
- వ్యాక్సిన్, ముందు జాగ్రత్తలతో రక్షణ
- హెచ్ఐవీ, డయాలసిస్ బాధితుల్లో ఎక్కువగా వ్యాప్తి

ప్రపంచ హెపటైటిస్ డే నేడు



నెల్లూరు(అర్బన్): హెపటైటిస్‌పై ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, అది ప్రాణాలకే ప్రమాదం తెచ్చే అవకాశాలెక్కువ. సాధారణంగా కామెర్లు హెపటైటిస్ ఏ వైరస్ ద్వారా వస్తుంది. వైద్యుల వద్ద చికిత్స పొంది.. తగినంత విశ్రాంతి తీసుకుంటే రోగి క్రమేపీ కోలుకుంటారు. అయితే లక్షణాలు పైకి కనిపించకుండా రక్తంలోనే హెపటైటిస్ బీ, సీ వైరస్‌లు ఉంటాయి. చాలా ఏళ్ల తర్వాత గానీ ఈ లక్షణాలు బయటపడవు. దీని కారణంగా వ్యాధి తీవ్రమై లివర్ దెబ్బతిని చికిత్సకు వీల్లేకుండానే మరణించే దశకు చేరుకుంటారు. ఈ తరుణంలో హెపటైటిస్ వైరస్‌పై అవగాహన కలిగి ఉండటంతో పాటు వ్యాక్సిన్లను ముందుగానే వేయించుకోవాలి. ఏటా జూలై 28వ తేదీని వైరల్ హెపటైటిస్ డేగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హెపటైటిస్ డేను జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లాలో హెపటైటిస్ కేసులు ఏటా పెరుగుతున్నాయి. మద్యం అతిగా సేవించే వారిలో ఆల్కహాలిక్ హెపటైటిస్ కేసులు నమోదవుతున్నాయి. మురికివాడలు, డయాలసిస్ కేసులు, హెచ్ఐవీ ఉండే వారిలో మరింత వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. జిల్లాలో సుమారు 25 వేల మంది వరకు హెపటైటిస్ బీ, సీ వైరస్‌తో బాధపడుతున్నారని సమాచారం.

వైద్యశాఖలో లెక్కలు నిల్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, పది సీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆస్పత్రులున్నాయి. వీటి పరిధిలో తగు స్క్రీనింగ్ పరీక్షలు చేయకపోవడం, పరీక్షలు చేసినా రికార్డుల నిర్వహణ లేకపోవడంతో లెక్కల్లేవు.

ఐదు రకాల హెపటైటిస్ వైరస్‌లు

హెపటైటిస్ వైరస్‌లలో ఏ, బీ, సీ, డీ, ఈ రకాలు. కలుషిత నీరు, కలుషిత ఆహారం వల్ల ఏ వైరస్ వస్తుంది. విశ్రాంతి పొందడంతో పాటు తేలికపాటి ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తగ్గిపోతుంది. డీ, ఈ వైరస్ చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. బీ వైరస్ సోకిన వారికే డీ వైరస్ ఎక్కువగా వస్తుంది.

బీ వైరస్‌తో డేంజర్

హెపటైటిస్ బీ అత్యంత ప్రమాదకరం. చాలా కాలం పాటు ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వచ్చినప్పుడు డాక్టర్లు అన్ని పరీక్షలతో పాటు హెపటైటిస్ బీ టెస్ట్ చేస్తారు. అలా చేసినప్పుడే వ్యాధి బయటపడుతుంది. ఇందులో కాలేయం గట్టి పడి.. ఆపై ఫెయిలవుతుంది. దీని ప్రభావం కిడ్నీలపై పడి అవి కూడా పాడవుతాయి. చివరికి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

- 2022లో 14,684 మందికి పరీక్షలు చేయగా, 205 మందికి.. 2023లో 21,837 మందికి టెస్ట్‌లు చేయగా, 404 మందికి.. 2024లో ఇప్పటి వరకు 13,405 మందిని పరీక్షించగా, 262 మంది హెపటైటిస్ బారిన పడ్డారని తేలింది. గతేడాదిలో పది మంది డయాలసిస్ రోగులను పరీక్షించగా, ముగ్గురికి.. హెచ్ఐవీ రోగులు 7961 మందిలో 224 మందికి.. సెంట్రల్ జైలు నుంచి వైద్యం కోసం వచ్చిన 388 మందిలో నలుగురు హెపటైటిస్ బీ బారిన పడ్డారు.
- గత రెండున్నరేళ్లలో 20 వేల మందిని పెద్దాస్పత్రిలో పరీక్షించగా, 79 మంది హెపటైటిస్ సీ బారిన పడ్డారు. 93 మంది డయాలసిస్ రోగుల్లో 13 మంది, 7802 మంది హెచ్ఐవీ రోగుల్లో ముగ్గురు, 388 మంది ఖైదీల్లో ఒకరు ఈ వైరస్ బారిన పడ్డారని తేలింది.

పెద్దాస్పత్రిలో ఉచిత పరీక్షలు



ప్రభుత్వ పెద్దాస్పత్రిలో వైరల్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నాం. రోగి కోలుకునేంత వరకు పర్యవేక్షిస్తున్నాం. హెపటైటిస్ వ్యాధి ప్రమాదకరంగా మారకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు పరీక్షలు చేయించుకొని వైద్యం పొందాలి.

– నరేంద్ర, ప్రొఫెసర్, హెచ్ఓడీ, జనరల్ మెడిసిన్ విభాగం

చికిత్స తీసుకోవాలి



హెపటైటిస్ సీ వైరస్‌కు మంచి చికిత్స అందుబాటులోకి వచ్చింది. పరీక్షలు చేయించుకొని ఈ వైరస్ ఉన్న వారు చికిత్స తీసుకుంటే మూడు నెలల్లో వ్యాధి నయమవుతుంది. హెపటైటిస్ బీకి సంబంధించి మూడు నుంచి నాలుగేళ్లు వైద్యం చేయించుకోవాలి.

– సునీల్‌కుమార్, హెపటైటిస్ జిల్లా నోడల్ ఆఫీసర్, జీజీహెచ్

ఏబీవీపీ నేతల ధర్నా



విచారణ చేస్తున్న ఎంఈఓలు

సోమశిల: అనంతసాగరం మండలంలో విద్యార్థి తండ్రిపై శుక్రవారం జరిగిన దాడిని ఖండిస్తూ లిటిల్ ఏంజెల్స్ పాఠశాల వద్ద ధర్నాను ఏబీవీపీ నేతలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సఖ్యతగా ఉండాల్సింది పోయి, ఉపాధ్యాయులు ఇలా దాడులు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఏబీవీపీ జిల్లా కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓల విచారణ

విచారణ నిమిత్తం పాఠశాలకు ఎంఈఓలు జానకీరామ్‌టంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విచ్చేశారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు, సోమశిల, కమ్మవారిపల్లిలోని తల్లిదండ్రులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నామని వివరించారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు గాయాలు

ఇందుకూరుపేట: బైక్ అదుపుతప్పడంతో కానిస్టేబుల్ గాయపడిన ఘటన మండలంలోని యాగర్ల వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృష్ణ విధుల నిమిత్తం నెల్లూరు వైపు వెళ్తుండగా, యాగర్ల వద్ద బైక్ అదుపుతప్పింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

'జెనెక్స్'లో జాబ్‌మేళా



నెల్లూరు (టౌన్): నగరంలోని జెనెక్స్ విజన్ బీ స్కూల్ కాంప్లెక్స్‌లో జాబ్‌మేళాను శనివారం నిర్వహించారు. అల్ట్రస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెక్నికల్ సపోర్ట్ , ఇమర్క్యూ సొల్యూషన్స్‌లో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించగా, 45 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనంగా రూ.2.25 లక్షలను ఇవ్వనున్నారని వెల్లడించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. హెచ్ఆర్‌లు యశ్వంత్, షాహిద్‌బాజీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ తేజ, ప్లేస్‌మెంట్ అధికారి చరణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని కరెంటాఫీస్ రైల్వే గేట్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు కలిగి.. గ్రీన్ రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, బ్లూ రంగు ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. ఘటన స్థలాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

కుటుంబ సమస్యలతో మహిళ..

అనుమసముద్రంపేట: కుటుంబ సమస్యల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని పెద్దబ్బీపురంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇమ్మిడిశెట్టి బాలయ్య, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నారాణయమ్మ (42) ఉరేసుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు ఆమెను ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు





నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆర్టీసీ స్పోర్ట్స్ మీట్‌ను శనివారం ప్రారంభించారు. పోటీలకు జోన్ – 3 నుంచి ఐదు జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. 16 విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈడీ ఆదామ్ సాహెబ్, నెల్లూరు రీజనల్ డీపీటీఓ విజయరత్నం పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ

నెల్లూరు (టౌన్): భక్తవత్సలనగర్‌లోని కేఎన్నార్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది సన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందిన ఘటనపై నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మిని విచారణాధికారిగా నియమించారు. ఈమెకు సహాయకులుగా మరో ఇద్దర్ని నియమించారు. ఈ క్రమంలో పాఠశాలకు శనివారం వెళ్లిన ఆమె ఘటనపై ఉపాధ్యాయులు, స్థానికులను అడిగి వివరాలను సేకరించారు. నిర్మాణంలో ఉన్న గదుల వద్దకు విద్యార్థి ఎందుకెళ్లారనే అంశంపై ఆరాతీశారని సమాచారం. మరోవైపు అంత్యక్రియల నిమిత్తం బాలుడి మృతదేహాన్ని ఓజిలికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఆదివారం సైతం విచారణ జరిపి నివేదికను డీఈఓ రామారావుకు అందజేయనున్నారు. దీన్ని కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్, విద్యాశాఖ కమిషనర్‌కు పంపనున్నామని డీఈఓ తెలిపారు. విద్యార్థి కుటుంబానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని నేడో రేపో అందజేయనున్నామని పేర్కొన్నారు. కాగా విద్యార్థి మృతి కారణంగా పాఠశాలకు శనివారం సెలవు ఇచ్చారు.

చర్యలుంటాయా..?

కేఎన్నార్ స్కూల్లో విద్యార్థి మృతి ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు చేపడతారా.. లేక తుస్సుమనిపిస్తారానే అనుమానం కలుగుతోంది. కొంత కాలంగా గదుల నిర్మాణం జరుగుతున్నా, అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. కొన్ని గదుల గోడలపై సన్‌షేడ్లను నామమాత్రంగా పెట్టారు. కొంతకాలంగా నిర్మాణం నిలిచిపోయింది. పాఠశాలలను ప్రారంభించి 45 రోజులైనా ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను పెట్టిన దాఖలాల్లేవు. ఈ విషయమై హెడ్‌మాస్టర్ విజయప్రకాష్‌పై డీఈఓ రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు జాగ్రత్తలు చేపట్టని హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులపై చర్యలుంటాయా లేక వదిలేస్తారనే విషయం తేలాల్సి ఉంది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.